# అర్ధ నారీశ్వరం



*సంధ్యా గృహీత జలాంజలి*
*ప్రతిమా సంక్రాత గౌరీ ముఖకమలం*
*అలీకమేవ స్ఫురితోష్ఠం*
*విగలిత మంత్రం హరం నమత*

***భావం:*** సంధ్య వార్చడానికి దోసిట్లోకి తీసుకున్న నీళ్ళలో పార్వతి ముఖ పద్మం కన్పించగా మంత్రాన్ని మర్చిపోయి ఊరికే పెదవులు కదిలిస్తున్న శివుడికి నమస్కరించండి.

ప్రపంచంలో అన్నిటికన్నా గొప్పది ప్రేమశక్తి. ప్రేమశక్తికి లొంగనివారు లేరు. భార్య మీద ప్రేమతో బ్రహ్మ ఆమెను నాలుక మీద ధరించాడు. విష్ణువు వక్షస్థలంపై ఉంచుకున్నాడు. శివుడు శరీరంలో సగ భాగాన్ని భార్య కిచ్చాడు. భార్యాభర్తల మధ్య ప్రేమకు పరాకాష్ఠగానే అర్ధ నారీశ్వర తత్వాన్ని చెప్తారు.

ప్రాణికోటిని సక్రమ మార్గంలో నడిపించడానికి భగవంతుడు కూడా ధర్మకృత్యాలు నిర్వర్తిస్తాడు. "నేను కర్మ మార్గాన్ని అవలంబించకపోతే మనుష్యులందరూ కూడా నన్ను అనుసరించి కర్మ వదిలేస్తారు" అని గీతలో భగవంతుడు శలవిచ్చాడు కదా.

ఆ కారణం గానే శివుడు ఒకనాడు ఉదయమే సంధ్యావందనం చెయ్యడానికై చేతులతో నీళ్ళు తీసుకున్నాడు. నీళ్ళల్లో ఉదయ సూర్యబింబం తాలూకు ఎర్రటి ఎండ పడింది. ఎర్రటి గుండ్రటి సూర్య బింబాన్ని చూస్తే శివుడికి పార్వతి ముఖపద్మం జ్ఞాపకం వచ్చింది. సిగ్గుతో ఎర్రబడ్డ ఆమె ముఖాన్ని తల్చుకుంటూ శివుడు సంధ్యా వందనం మానేసి ఊరికేపెదవులు కదల్చసాగాడు. కొంతసేపటికి ఆయనకు కర్తవ్యం జ్ఞాపకం వచ్చింది. తిరిగి ప్రార్థన ప్రారంభించి నీళ్ళను సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వడానికి తల ఎత్తాడు. నది ఒడ్డున పార్వతి కనిపించింది. ఆమె ముఖం ఎర్రగా ఉంది. సిగ్గుతో కందినట్లు లేదు. కోపంతో ఎర్రబడ్డట్టుగా ఉంది. కోపం ఎందుకువచ్చిందోఅనుకుంటూ శివుడు మళ్ళీ మంత్రం మర్చిపోయాడు. ఊరికేనే పెదవులు కదల్చసాగాడు.

కొంతసేపటికి శివుడికి పార్వతి కోపానికి కారణం తెలిసి నవ్వు వచ్చింది. సంధ్యా దేవి స్త్రీ దేవత. ప్రార్థనలో స్త్రీ పేరు చెప్పినా భార్యలకు అసూయ వస్తుందా? పార్వతి అందుకే అలిగిందా?

పార్వతి అలక ఎలా తీర్చాలన్న ఆలోచనలోపడ్డ శివుడి మనస్సింక సంధ్యావందనం, పూజపై లగ్నం కాలేదు. పరమేశ్వరుడు మంత్రం మర్చిపోయి మళ్లీ పెదవులు కదల్చసాగాడు.

ప్రేమశక్తి ఎంతగొప్పదో తెలియచేసే పద్యం ఇది. భగవంతుడైన శివుడు సైతం ప్రార్థనా మంత్రాన్ని మర్చి పోయాడు. ప్రేమైకమూర్తి అయిన శివునకు నమస్కరించమని పద్య రచయిత అన్నాడు. ఆ విధమైన ప్రార్థన చేసిన వారి జీవితాలు ప్రేమమయాలు అవుతాయి అన్న సూచనను కవి ఇచ్చిఉండవచ్చును.

భారతీయ మతంలోని ప్రత్యేకత ఇదే. భగవంతుని ఒక వృద్ధ పురుషుడిగా కాక స్త్రీ పురుషుల సమ్మేళనంగా ఆరాధించడం స్త్రీలు పురుషులతో సమానమని భావించడం ప్రేమను శరీర సంబంధమైన ఉన్మత్తతగా కాక ప్రకృతి పురుషుల దివ్య సంయోగంగా చిత్రించడం ప్రాచీన భారతీయుల ధర్మ మార్గానికి చిహ్నాలు.

******